ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 28.0
కనిష్ఠం 23.4
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
5
బుధవారం 4 సెప్టెంబరు 2024



| ప్రాజెక్టు | పూర్తిస్థాయి | ప్రస్తుతం | ఇన్‌ఫ్లో | అవుట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| | నీటి మట్టం (అడుగులు) | | (క్యూసెక్కులు) | |
| సాగర్ (టీఎంసీలు) | 590 (312.5050) | 585.90 (300.3015) | 3,37,687 | 3,16,516 |
| మూసీ (టీఎంసీలు) | 645 (4.46) | 642.20 (3.74) | 6,277 | 1,244 |
| పులిచింతల (టీఎంసీలు) | 175 (45.77) | 172.21 (41.54) | 4,07,855 | 4,35,518 |

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు: లైవ్: రూ.130 | డ్రెస్: రూ.210 | స్కిన్‌లెస్: రూ.230



# బునాదిగానిపై ఆశలు

బునాదిగాని కాల్వ పూర్తిపై రైతుల్లో మళ్లీ ఆశలు రేకెత్తుతున్నాయి. ఈ పనుల పూర్తికి నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రూ.269కోట్లు మంజూరు చేస్తానని గత నెల 30న భువనగిరిలో జరిగిన పార్లమెంట్‌స్థాయి సమీక్షలో హామీ ఇచ్చారు. దీంతో ఈ ప్రభుత్వంలోనైనా కాల్వ నిర్మాణం పూర్తవుతుందా అని రైతులు చర్చించుకుంటున్నారు.

\- మోత్కూరు

» ఉత్తమ్ హామీతో కల సాకారమయ్యేనా? » సాగునీటి కోసం రైతుల ఎదురుచూపు

ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారినా 20 ఏళ్లుగా బునాదిగాని కాల్వ తవ్వకం నత్తనడకన సాగుతోంది. ప్రతీ అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో అన్ని పార్టీలకు ఈ కాల్వ సమస్య ప్రచారాస్త్రంగా మిగిలింది. కాల్వ నిర్మాణం పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యేలు, నాయకులు వాగ్దానాలు చేసినా నేటికీ పనులు పూర్తికాలేదు. దీంతో ఎప్పటిలాగే మోత్కూరు, అడ్డగూడూరు, ఆత్మకూరు(ఎం), మోటకొండూరు, భువనగిరి, బీబీనగర్ మండలాలకు చెందిన రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు.

### రూ.14.53 కోట్ల అంచనాతో

బునాదిగాని కాల్వ మొదటి దశ బీబీనగర్ మక్తఅనంతారం నుంచి వలిగొండ మండలం పహిల్వాన్‌పురంలోని బునాదిగాని చెరువు వరకు పనులకు రూ.5.23కోట్లతో 2005లో అంచనా రూపొందించారు. ధర్మారం పేరుతో బునాదిగాని కాల్వ రెండో దశ వలిగొండ మండలం బునాదిగాని చెరువు నుంచి అడ్డగూడూరు మండలం ధర్మారం చెరువు వరకు కాల్వ తవ్వకం కోసం రూ.9.30కోట్లు మంజూరు చేశారు. ఏళ్లు గడిచినా పనులు పూర్తి కాలేదు. 2014లో రాష్ట్ర ఏర్పాటు అనంతరం బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక బునాదిగాని కాల్వ నిర్మాణం పూర్తి చేయాలని ఈ ప్రాంత ప్రజలు మరో సారి ఆందోళనలు చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ 2014 ఎన్నికల్లో బునాదిగాని కాల్వను ప్రధాన ప్రచారాస్త్రంగా వినియోగించాయి. ఎవరికి వారు తాము అధికారంలోకి వస్తే వెంటనే కాల్వ నిర్మాణం పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల అనంతరం ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, అప్పటి తుంగతుర్తి ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌తో కలిసి సమస్యను అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు.

2016లో హరితహారం కార్యక్రమం ప్రారంభించేందుకు చౌటుప్పల్ సమీపంలోని పంతంగికి రాగా, బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వలకు రూ.220 కోట్లు మంజూరు చేశారు. అందులో ఈ కాల్వకు రూ.71కోట్లు మంజూరయ్యాయి. కాగా, కేవలం రూ.33కోట్ల విలువైన పనులే పూర్తయ్యాయి. ఏటా పెరుగుతున్న ఖర్చులతో గిట్టుబాటుకాక ఈ పనులను పూర్తిచేయకుండా కాంట్రాక్టర్ వదిలేశాడు. తాజాగా, నీటిపారుదల శాఖ ఇంజనీర్లు సమర్పించిన ప్రతిపాదనల మేరకు బునాదిగాని కాల్వ నిర్మాణానికి రూ.269కోట్లు మంజూరు చేస్తానని ఈ నెల 30న భువనగిరిలో జరిగిన సాగునీటి వనరుల సమీక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు.

### ఇప్పటి వరకు 34కి.మీ పూర్తి

బునాదిగాని కాల్వ 6.6మీటర్ల వెడల్పు, 1.6మీటర్ల లోతుతో నిర్మాణం చేపట్టారు. కాల్వ మొత్తం పొడవు 98.64కిలోమీటర్లు కాగా, ఇప్పటి వరకు 34కి.మీ పూర్తయింది. కాల్వపై 259 కల్వర్టులు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటికి 33 మాత్రమే పూర్తయ్యాయి. కాల్వ నిర్మాణం పూర్తయితే ఏడు మండలాల్లోని 50 చెరువులను నీటితో నింపవచ్చు. దీని పరిధిలో 20,575 ఎకరాలకు సాగునీరందుతుందని అంచనా. కాల్వ నిర్మాణం కోసం 508 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 346 ఎకరాలు సేకరించి, రైతులకు పరిహారం చెల్లించారు. అడ్డగూడూరు, బీబీనగర్ మండలాల్లో ఇంకా 162 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది.

### ఉప్పునూతల కృషితో

ఆత్మకూరు(ఎం), మోత్కూరు, అడ్డగూడూరు మండలాలకు సాగు నీరందించాలని ఈ ప్రాంత రైతులు, ప్రజాప్రతినిధులు ఎన్నో ఏళ్ల చేసిన పోరాటం ఫలితంగా 2005లో అప్పటి రామన్నపేట ఎమ్మెల్యే ఉప్పునూతల పురుషోత్తమరెడ్డి కృషితో బునాదిగాని (ధర్మారం) కాల్వ రూపుదిద్దుకుంది. ఈ కాల్వ మొదటి దశకు 2005, ఏప్రిల్ 10న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రామన్నపేటలో శంకుస్థాపన చేశారు. ఆ తరువాత కాల్వ రెండో దశకు ధర్మారం పేరుతో అడ్డగూడూరు మండలం ధర్మారం చెరువు వద్ద 2006, ఏప్రిల్ 24న అప్పటి నీటిపారుదలశాఖ మంత్రి శత్రుచర్ల విజయరామారావు శంకుస్థాపన చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2017, నవంబరు 5న మోత్కూరు మండలం పనకబండ గ్రామం వద్ద బునాదిగాని (ధర్మారం) కాల్వకు అప్పటి తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ శంకుస్థాపన చేశారు. అయినా కాల్వ నిర్మాణం నేటికీ పూర్తి కాలేదు.



అసంపూర్తిగా ఉన్న బునాదిగాని కాల్వ

### బునాదిగాని కాల్వ నిర్మాణం పూర్తి చేయిస్తా



సుమారు 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బునాదిగాని కాల్వ నిర్మాణం తప్పక పూర్తి చేయిస్తా. నేను పలుమార్లు ఈ సమస్యను సీఎం రేవంత్‌రెడ్డితో పాటు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లా. దీంతో కాల్వ నిర్మాణానికి రూ.269 కోట్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. సాగునీటి కోసం ఈ ప్రాంత రైతులు ఎంత ఇబ్బంది పడుతున్నారో నాకు తెలుసు. కాల్వ నిర్మాణం పూర్తి చేయించడంతో పాటు బస్వాపూర్ రిజర్వాయర్‌కు అనుసంధానం చేసి గోదావరి జలాలు అందించేలా కృషి చేస్తా.

\- మందుల సామేల్, తుంగతుర్తి ఎమ్మెల్యే

### బస్వాపూర్‌కు అనుసంధానమయ్యేనా?

బునాదిగాని కాల్వ పూర్తయినా, మూసీ మురుగు నీటితో జలకాలుష్యం ఏర్పడి పంటలు దెబ్బతింటాయని రైతులు పేర్కొంటున్నారు. ఈ కాల్వను బస్వాపూర్ రిజర్వాయర్‌కు అనుసంధానం చేసి గోదావరి జలాలు అందించాలని ఈ ప్రాంత రైతులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో బునాదిగాని కాల్వను బస్వాపూర్ రిజర్వాయర్‌కు అనుసంధానం చేసి గోదావరి నీళ్లతో ఈ ప్రాంత రైతుల కాళ్లు కడుగుతానని గతంలో పలుమార్లు తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ హామీ ఇచ్చారు. గోదావరి జలాలు వస్తేనే ఈ ప్రాంతం సస్యశ్యామలమవుతుందని ఈ ప్రాంత రైతుల చిరకాల వాంఛ.



# ఐటీ చెల్లింపుల్లో నిర్లక్ష్యం

ఆదాయ పన్ను చెల్లింపులో భువనగిరి మునిసిపల్ అకౌంట్స్ సెక్షన్ నిర్లక్ష్యం కాంట్రాక్టర్లకు ప్రతిబంధకంగా మారింది. చేసిన పనులకు బిల్లు చెల్లింపు సమయంలో మినహాయించుకున్న ఐటీని సకాలంలో చెల్లించకపోవడంతో పలువురు కాంట్రాక్టర్లు ఇటీవల నిర్వహించిన అభివృద్ధి పనుల టెండర్లలో అనర్హతకు గురయ్యారు. దీంతో కాంట్రాక్టర్లు అకౌంట్స్ సెక్షన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత కమిషనర్ వ్యవహార తీరుతోనే ఐటీని చెల్లించలేకపోయామని మునిసిపల్ వర్గాలు పేర్కొంటున్నాయి.

\- భువనగిరి టౌన్

» మునిసిపల్ అధికారుల నిర్వాకం.. కాంట్రాక్టర్లకు శాపం
» బిల్లుల నుంచి మినహాయించిన ఐటీని చెల్లించని అకౌంట్స్ విభాగం
» రూ.2.43కోట్ల అభివృద్ధి పనుల టెండర్లకు అర్హత కోల్పోయిన కాంట్రాక్టర్లు

కాంట్రాక్టర్లకు పనుల బిల్లులు చెల్లింపు సమయంలో 16 శాతం జీఎస్టీ, 2శాతం ఐటీని మునిసిపాలిటీ మినహాయిస్తుంది. మినహాయించిన 16శాతం జీఎస్టీ వెంటనే జీఎస్టీ ఖాతాలోకి వెళుతుండగా, రెండు శాతం ఐటీని మాత్రం కాంట్రాక్టర్ల పేరున మునిసిపాలిటీ ఆదాయపన్ను శాఖకు చెల్లించాల్సి ఉంటుంది. అయితే 2023 అక్టోబరు నుంచి 2024 మార్చి వరకు కాంట్రాక్టర్లకు చెల్లించిన బిల్లుల్లో మినహాయించిన రెండు శాతం ఐటీ రూ.13లక్షలను సకాలంలో ఆదాయపన్ను శాఖకు మునిసిపాలిటీ చెల్లించలేదు. ఈ నేపథ్యంలో ఇటీవల రూ.2.43 కోట్ల అంచనా వ్యయంతో 44 అభివృద్ధి పనులను మునిసిపల్ కౌన్సిల్ ఆమోదించింది. అందుకు ఆగస్టు 13న మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగం టెండర్లను పిలిచింది. దీంతో సుమారు 20 మందికి పైగా కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొన్నారు. అయితే 15 మందికి పైగా స్థానిక కాంట్రాక్టర్లు ఐటీ చెల్లించలేదనే సాంకేతిక కారణంతో టెండర్ల ప్రక్రియలో అధికారులు అనర్హులుగా ప్రకటించారు. దీంతో 44 పనులు కేవలం నలుగురు కాంట్రాక్టర్లకే దక్కాయి. అయితే తమ బిల్లుల నుంచి మినహాయించుకున్న రెండు శాతం ఐటీని ఆదాయపన్ను శాఖకు చెల్లించాల్సిన బాధ్యతను విస్మరించిన మునిసిపల్ అధికారులు టెండర్ల ప్రక్రియ నుంచి తమను ఎలా అనర్హులను చేస్తారని కాంట్రాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మునిసిపల్ తప్పిదంతో తమకు రిమార్క్ రావడంతో పాటు పనులను నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక కారణం చూపుతూ టెండర్ల ప్రక్రియ నుంచి తమను అనర్హులను చేసిన అధికారులు, ఐటీ చెల్లింపులో నిర్లక్ష్యం చూపిన అకౌంట్స్ సెక్షన్‌పై శాఖాపర చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. అయితే గత కమిషనర్ తప్పిదాలతోనే సకాలంలో ఆదాయ పన్నును చెల్లించలేకపోయామని అకౌంట్స్ సెక్షన్ సిబ్బంది పేర్కొంటున్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలు, ఇతర బిల్లుల చెల్లింపుల కోసం అప్పటి కమిషనర్ నిధులను మళ్లించడంతో ఐటీని చెల్లించలేకపోయామని, పైగా నిధుల మళ్లింపుపై అభ్యంతరం వ్యక్తం చేసినందుకు అప్పటి కమిషనర్ తనకు మెమో జారీచేశారని అకౌంటెంట్ మంజుల తెలిపారు. అదే సమయంలో సుమారు 15 మంది కాంట్రాక్టర్లను అనర్హులను చేసిన అధికారులు మరో కాంట్రాక్టర్‌కు మాత్రం 10కి పైగా పనులను అప్పగించడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్లందరి ఐటీని చెల్లించలేదని అధికారులు చెబుతుండగా, ఒక్క కాంట్రాక్టర్ ఐటీని మాత్రమే ఎలా చెల్లించారని, మిగతావారు ప్రశ్నిస్తుండగా, అతనొక్కడే సొంతంగా ఐటీని చెల్లించి ఉండవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఐటీ చెల్లింపు జరగలేదనే విషయంలో తమను ఎందుకు అప్రమత్తం చేయలేదని కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు. ఏదేమైనా మినహాయించుకున్న ఐటీ చెల్లింపులో మునిసిపాలిటీ చూపిన నిర్లక్ష్యం కాంట్రాక్టర్లకు నష్టం జరగడంతో పాటు మునిసిపల్ పనితీరు చర్చనీయాంశంగా మారింది.

### బకాయిపడిన రూ.13లక్షల ఐటీని చెల్లిస్తున్నాం



కాంట్రాక్టర్ల బిల్లుల నుంచి మినహాయించిన రూ.13లక్షల ఐటీని ఆదాయపన్ను శాఖకు త్వరలో చెల్లించనున్నాం. ఐటీ చెల్లింపులో నెలకొన్న జాప్యంతోనే సాంకేతికంగా కాంట్రాక్టర్లు టెండర్ల నుంచి అనర్హులు అయ్యారు. ఐటీ చెల్లింపులో జరిగిన అలస్యంపై అకౌంట్స్ సెక్షన్‌ను వివరణ కోరాం. నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్ల బిల్లుల నుంచి మినహాయించిన 2శాతం ఐటీని వెంటనే ఆదాయపన్ను శాఖకు మునిసిపాలిటీ చెల్లించాల్సి ఉంటుంది. కానీ, అప్పటి అధికారుల పర్యవేక్షణా లోపం కారణంగా సకాలంలో ఐటీ చెల్లింపు జరగలేదు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

\- పి.రామాంజులరెడ్డి, కమిషనర్, భువనగిరి మునిసిపాలిటీ

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**కలెక్టర్ హనుమంతు కే.జెండగే**



ప్రాథమిక పాఠశాలలో ఇంగ్లీష్ పాఠం చదివిస్తున్న కలెక్టర్

**చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 3:** సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. చౌటుప్పల్ మునిసిపాలిటీలోని తంగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆరోగ్యకేంద్రంలో సీజనల్ వ్యాధుల నిర్ధారణకు చేస్తున్న రక్త పరీక్షలు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, ఔషధాల సరఫరావంటి వాటిని కలెక్టర్ పరిశీలించారు. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలను వైద్యాధికారులు కాటంరాజు, సంపత్ కుమార్‌లను అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటి జ్వర సర్వే పక్కాగా చేయాలని, అవసరమైన ప్రాంతంలో మెడికల్ క్యాంప్‌ను ఏర్పాటు చేయాలన్నారు. జ్వర సర్వేలో గుర్తించిన వారిని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రక్త పరీక్షలు చేసి అవసరమైన వైద్య సేవలను అందించాలన్నారు. మునిసిపాలిటీతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో దోమల నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, నీటినిల్వ గుంతలు ఉండకుండా చూడాలని మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్, ఎంపీడీవో ప్రమోద్ కుమార్‌ను కలెక్టర్ ఆదేశించారు. నీటిగుంతల్లో దోమల నివారణకు ఆయిల్‌బాల్స్‌ని ఉపయోగించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన అన్ని రకాల పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో పని చేసే వైద్య బృందం అప్రమత్తంగా ఉండాలని, జలుబు, దగ్గు, జ్వరం వంటివి వస్తే వెంటనే మందులు అందించాలన్నారు.

### ఆరోగ్య కేంద్ర భవనాన్ని పూర్తి చేయించాలి : కలెక్టర్

మండల పరిధిలోని దామెర గ్రామంలో అసంపూర్తిగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని త్వరగా పూర్తిచేయించి అప్పగించాలని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి నితీష్‌ను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా మండల పరిధిలోని చింతలగూడెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, అమ్మ ఆదర్శ పాఠశాలను కలెక్టర్ తనిఖీచేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో కల్పిస్తున్న మౌలిక వసతులను కలెక్టర్ పరిశీలించారు. మూడో తరగతి విద్యార్థులతో ఇంగ్లీష్, లెక్కలు చదివించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ప్రయోజకులుగా ఎదగాలని కలెక్టర్ ఆకాక్షించారు.

# అనుమతులు మేడ్చల్‌లో.. నిర్వహణ భువనగిరిలో..




భువనగిరిలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న జైహింద్ కళాశాల

**భువనగిరి టౌన్, సెప్టెంబరు 3:** మేడ్చల్ జిల్లా ఈసీఐఎల్‌లో జై హింద్ ఇంటర్ కళాశాల నిర్వహణకు యాజమాన్యం ఇంటర్ బోర్డు నుంచి అనుమతులు పొందింది. కానీ తరగతులను మాత్రం భువనగిరి జిల్లాకేంద్రంలో జై హింద్ డిఫెన్స్ అకాడమీ, ఇంటర్మీడియట్ కళాశాల పేరిట తరగతులు నిర్వహిస్తోంది. ఈ మేరకు వచ్చిన ఫిర్యాదులపై ఇంటర్ నోడల్ అధికారి రమణి మంగళవారం కళాశాలను తనిఖీచేశారు. వివిధ గ్రూపులలో 45మంది మొదటి సంవత్సరం, 15 మంది ద్వితీయ సంవత్సరం చదువుతూ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్నట్లు తేలింది. అయితే వీరందరూ మేడ్చల్ జిల్లాలోని ఆకాష్ ఇంటర్ కళాశాలలో ప్రవేశాలు పొంది భువనగిరిలోని ఆ పేరుతోనే ఉన్న కళాశాలలో చదువుకుంటున్నట్లు నిర్ధారణ అయింది. అలాగే ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సరం పరీక్షలను కూడా ఈసీఐఎల్ కళాశాలలోనే రాసినట్లు తేలింది. దీంతో భువనగిరిలో నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న కళాశాలపై చర్యలు తీసుకోనున్నట్లు, ఈ మేరకు ఇంటర్ బోర్డు కమిషనర్‌కు నివేదిక ఇచ్చినట్లు రమణి తెలిపారు.

# పంటలకు జీవం పోసిన వానలు



అనాజ్‌పూర్ చెరువులోకి చేరిన నీరు

**యాదాద్రి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి):** జిల్లాలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే కూడా తక్కువగా వర్షపాతం నమోదైంది. పలుచోట్ల సాధారణంగా ఉంది. భారీ వర్షాలు కురవనందున చెరువుల్లోకి నీరు చేరలేదు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతుంటే జిల్లాలో ఇందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. గత నాలుగురోజుల క్రితం వరకు జిల్లాలో సగటున సాధారణ వర్షపాతంకంటే తక్కువగా ఉంది. ఓ మోస్తరుతోపాటు భారీ వర్షాలు కురవడంతో జిల్లాలోని 17 మండలాలకు 10 మండలాల్లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు కాగా.., ఏడు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ఈ వర్షాలతో పత్తితోపాటు ఆరుతడి, కూరగాయలు, వరి పంటలకు జీవం పోసినట్లయింది. భూగర్భజలాలు కూడా పెరగనున్నాయి. జిల్లాలోని మూసీ పరివాహక ప్రాంతాల్లోని వరి చేలోకి నీరు చేరిందని, పంటనష్టం వాటిల్లలేదని వ్యవసాయ అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ జంట నగరాల్లో వర్షాలు తగ్గుము ఖం పట్టడంతో మూసీ నదికి వరద నీరు తగ్గింది. పలు గ్రామాలకు రాకపోకలు కొనసాగుతున్నాయి. ఇదిలా ఉంటే జిల్లాలో చిరుజల్లులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకు కురిసిన వర్షాలకు జిల్లాలో సగటున 3.1 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా తుర్కపల్లి మండలంలో 9.0 మి.మీలు, అత్యల్పంగా రాజపేటలో 1.2 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో మొత్తం 1147 చెరువులు ఉన్నాయి. జిల్లాలో 100ఎకరాలకు పైగా ఉన్న ఆయకట్టు ఉన్న చెరువులు 159 ఉండగా, 100ఎకరాల కంటే తక్కువగా ఉన్న చెరువులు 988 వరకు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 100శాతం నిండిన చెరువులు 16శాతం ఉండగా,అలుగుపారిన చెరువులు మాత్రం 9శాతం మాత్రమే ఉన్నాయి.

**ఆత్మకూరు(ఎం):** మండలంలోని టి.రేపాక గ్రామం బిక్కేరువాగులో నిర్మించిన చెక్ డ్యాంకు కింది భాగంలో బుంగ పడింది.రెండు రోజుల క్రితం కురిసిన వర్షం కారణంగా వాగులోకి వచ్చిన కొద్దిపాటి నీరు,చెక్ డ్యాంకు పడిన బుంగ ద్వారా వాగులోకి వెళ్లిపోతుందని, సంబంధిత అధికారులు స్పందించి, బుంగను పూడ్చాలని గ్రామ రైతులు కోరారు.

# ఉత్తమ రైతులకు అవార్డుల ప్రదానం

**భువనగిరి రూరల్, సెప్టెంబరు 3:** ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రాజేంద్రనగర్ ఆడిటోరియంలో జరిగిన సదస్సులో జిల్లాకు చెందిన ఇద్దరు రైతులకు ఉత్తమ రైతు అవార్డులను ప్రదానం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బీజే రావు, వ్యవసాయ శాఖ కార్యదర్శి, కమిషనర్ రఘునందన్‌రావు ఈ అవార్డులను అందజేశారు. సేంద్రియ వ్యవసాయం, పత్తిలో అధిక సాంద్రత విధానం, కూరగాయల పంటల్లో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించడం, విక్రయాలకోసం మొబైల్ రైతు బజారు ఏర్పాటు, రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసేందుకు కృషి చేసినందుకు భువనగిరి మండలం చందుపట్ల గ్రామానికి చెందిన సిద్ధారెడ్డికి అవార్డు దక్కింది. వరి, పత్తి, ఉద్యాన పంటల్లో ఆధునికీకరణ, యాంత్రీకరణ విధానంతో సాగుచేస్తూ కూలీల కొరతను అధిగమించడం, సుమారు 100 మంది రైతులను యాంత్రీకరణ వైపు మొగ్గు చూపేలా ప్రోత్సహించినందుకు రాజాపేట మండలం నెమిల గ్రామానికి చెందిన మేక వెంకటేశ్వర్‌రెడ్డికి అవార్డు దక్కింది. అయితే సీఆర్ఐ పంప్స్ సౌజన్యంతో వేర్వేరు విభాగాల్లో వీరు చేసిన అంశాలపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారికి ఉత్తమ అవార్డులను ప్రదానంచేసింది. కార్యక్రమంలో ఏరువాక శాస్త్రవేత్తలు డాక్టర్ బి.అనిల్‌కుమార్, కె.మమత పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న రైతు మందడి సిద్ధారెడ్డి

# నాయబ్ తహసీల్దార్ల బదిలీ

**పదోన్నతిపై బదిలీ చేసిన ప్రభుత్వం**

**భువనగిరి అర్బన్, సెప్టెంబరు 3:** జిల్లాలోని వివిధ మండలాల్లో విధులు నిర్వహిస్తున్న నలుగురు నాయబ్ తహసీల్దార్లు బదిలీ అయ్యారు. ఈమేరకు సీసీఎల్ఏ నవీన్ మిత్తల్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. బదిలీ అయిన వారిలో కేవీ రామానుజచారి (జనగాం), కే. రమాకాంత్ శర్మ(నల్లగొండ), భైరిరెడ్డి రాజేష్ (మేడ్చల్-మల్కాజ్‌గిరి), ఎం.డీ గూలాం ఇద్రీస్ (మేడ్చల్-మల్కాజ్‌గిరి), డి.శ్రీనివాస్ (సూర్యాపేట) జిల్లాలకు పదోన్నతిపై తహసీల్దార్లుగా బదిలీ అయ్యారు.

# పోషకాహార లోపాన్ని నివారించాలి

**అదనపు కలెక్టర్ గంగాధర్**

**భువనగిరి అర్బన్, సెప్టెంబరు 3:** పోషకాహార లోపాన్ని సమన్వయంతో నివారించేందుకు కృషి చేయాలని, అదేవిధంగా బాలింతలు, గర్భిణులు, పిల్లలకు పోషకాహారం పకడ్బందీగా అందజేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కే.గంగాధర్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం పోషణ మాసం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బాలింతలు, గర్భిణులు, ఐదేళ్లలోపు లోపు పిల్లలకు ప్రభుత్వం అందజేస్తున్న పోషకాహారాన్ని పకడ్బందీగా పంపిణీ చేయాలన్నారు.

ఈ నెల ఒకటో తేదీ నుంచి 30 వరకు జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసం నిర్వహిస్తున్నందున పిల్లల బరువు, ఎత్తు నమోదు చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఆయా శాఖలు సమన్వయంతో వయస్సుకు తగిన బరువు, ఎత్తు లేని పిల్లలకు పర్యవేక్షణతో కూడిన ఆహారాన్ని అందేలా చూస్తూ వైద్యపరీక్షలు చేయాలన్నారు. తక్కువ బరువున్న పిల్లలకు ఆకలి పరీక్షలు నిర్వహించడంతోపాటు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. వైద్యుల సలహా మేరకు పోషకాహార పునరావాస కేంద్రాలకు పంపాలన్నారు. కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, డీఆర్డీవో టి.నాగిరెడ్డి, ఇన్‌చార్జి వైద్యాధికారి ఎల్.యశోద, వైద్యులు డాక్టర్ మనోహర్, శిల్పిని, రామకృష్ణ, వీణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గంగాధర్

# టెన్నిస్‌కు వయస్సు అడ్డుకాదంటూ...

భువనగిరి టౌన్, సెప్టెంబరు 3 : ఐటీఎఫ్ వరల్డ్ మాస్టర్ టూర్-100 సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్ యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో ఉత్సాహంగా కొనసాగుతోంది. క్రీడాకారులు గెలుపుకోసం మైదానంలో చెమటోడుస్తున్న తీరు అబ్బురపరుస్తోంది. 30 నుంచి 75సంవత్సరాలు పైబడిన 10 కేటగిరీల్లోని స్త్రీ, పురుషుల సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ సుమారు 100మంది వెటరన్ క్రీడాకారులు పోటీపడుతున్నారు. చివరి రోజైన బుధవారం పలు కేటగిరిలలో ఫైనల్స్ జరుగనున్నాయి.



### ● ఒకరి వెంట మరొకరుగా




వాసుదేవరెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పైగా టెన్నిస్ క్రీడాకారుడు. భార్య సునీత గృహిణి.వాసుదేవరెడ్డి ఉద్యోగం నుంచి రాగానే రాకెట్ పట్టుకుని టెన్నిస్ కోర్టుకు వెళ్లేవాడు. ఓ రోజు భర్తతో పాటు సునీత టెన్నిస్ కోర్టుకు వెళ్లింది. ఈ క్రమంలో ఆమె కూడా ఆటలో ప్రావీణ్యం పొందింది. దీంతో భార్యాభర్తలిద్దరూ మిక్స్‌డ్ డబుల్స్ ఆడుతూ టెన్నిస్ దంపతులుగా పేరుగాంచారు. పలు విజయాలు సాధించారు. వారి పిల్లలిద్దరు కూడా టెన్నిస్ ఆడుతూ రాణిస్తుండటంతో కుటుంబంలో టెన్నిస్ ఓ భాగమైంది. వారి ఇంటి నిండా రాకెట్స్, బాల్స్, ట్రోఫీలు ఉంటాయని ఆ దంపతులు తెలిపారు.

### కూతురు కోసం వెళుతూ..



నా కుమార్తె సాహిత్యకు టెన్నిస్ అంటే చాలాఇష్టం. ప్రస్తుతం ఆమె కృష్ణ యూనివర్సిటీ క్లబ్ మెంబర్. అయితే క్రీడాకారులు అందుబాటులో లేని సమయంలో ఆమె ఒంటరిగా టెన్నిస్ ఆడేది. దీంతో ఆమెను ప్రోత్సహించేందుకు నేను ప్రత్యర్థిగా మైదానంలో ఆడేదానిని. క్రమంలో నేనూ టెన్నీస్ క్రీడాకారిణిగా ప్రతిభ చూపే స్థాయికి ఎదిగా. ప్రస్తుతం నా వయస్సు 49 ఏళ్లు. ఇప్పటివరకు పలు పతకాలు సాధించా.గతంలో జర్నలిజం వృత్తిలో ఉన్న, ప్రస్తుతం హైదరాబాద్ యూనివర్సిటీలో హిందీ విభాగంలో పనిచేస్తున్నా.

శ్రీ జ్ఞానమూట్, హైదరాబాద్.

### టెన్నిస్‌కు వయస్సు అడ్డంకి కాదు



ప్రస్తుతం నా వయస్సు 77 ఏళ్లు. 14 ఏళ్ల వయసు నుంచే ఆడుతున్నా. మా ఇంట్లో నాలుగు తరాలు కలిసి టెన్నిస్ ఆడుతుంటాం. మా అందరి ఆరోగ్య రహస్యం టెన్నిస్ ఆడటమే. వెటరన్ టెన్నిస్ సిరీస్‌లో 75 సంవత్సరాల విభాగంలో 2023లో స్పెయిన్, 2024లో టర్కీ, కోల్‌కతాలో ఇండియా తరఫున ఆడా. శరీరం సహకరించినంత వరకు ఆడుతుంటా. అలాగే విజయవాడలోని సొంత క్లినిక్‌లో నేటికీ వైద్యుడిగా కొనసాగిస్తున్నా.

- డాక్టర్ సూదగాని రామకృష్ణ, విజయవాడ.

## జాతీయస్థాయి పోటీలు హర్షనీయం

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 3 : నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో జాతీయస్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఈ నెల 29 నుంచి మొదలయ్యే పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆయన మిర్యాలగూడలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్గనైజింగ్ ఫౌండర్ బూడిద సైదులు, కరాటే మాస్టర్ బానావత్ రామకృష్ణనాయక్ మాట్లాడుతూ పోటీలకు దేశం నలుమూలల నుంచి నుంచి 1000 మంది క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో నూకల వేణుగోపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



కరపత్రం విడుదల చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

## నేటి నుంచి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 3: రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నేటి నుంచి నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కోచ్ తోట రంగారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ప్రశాంత్ తెలిపారు. డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించే అండర్-11 బాలబాలికల పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 200మంది క్రీడాకారులు హాజరుకానున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్టేట్ అసోసియేషన్, డిస్ట్రిక్ట్ అసోసియేషన్ సంయుక్తంగా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కోచ్ మారబోయిన రామకృష్ణ, డాక్టర్ అంజయ్య, నవీన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య


రాజు(ఫైల్)

**సూర్యాపేట క్రైం, సెప్టెంబరు 3 :** ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆలస్యంగా వెలుగుచూసింది. పట్టణ ఇన్‌స్పెక్టర్ జీ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని హైటెక్‌బస్టాండ్ సమీపంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన కోడిమళ్ల రాజు(25) ప్రైవేట్‌ఉద్యోగం చేస్తున్నాడు. అయితే కుటుంబంలో కొంతమేర ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. దీంతో మనస్తాపంతో ఈ నెల 1వ తేదీన సాయంత్రం ఇంటి నుంచి బయటకువెళ్లాడు. కుటుంబ సభ్యులు రాత్రి సమయంలో రాజుకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. మరుసటి రోజు కుటుంబసభ్యులు రాజు ఆచూకీ కోసం బంధుమిత్రుల వద్ద ఆరా తీశారు. దీంతో సమాచారం లేకపోవడంతో సోమవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. అయితే మంగళవారం సాయంత్రం సద్దులచెరువులో మృతదేహం తేలి ఉండటాన్ని గమనించిన మత్స్యకారులు పోలీసులకు సమాచారమిచ్చారు. రాజు మృతదేహంగా కుటుంబ సభ్యులు గుర్తించారు. రాజు తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు.

## పాము కరిచి రైతు మృతి


శంకరయ్య(ఫైల్)

**ఆలేరు రూరల్, సెప్టెంబరు 3:** వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కరిచి రైతు మృతి చెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామంలో జరిగింది. కొలనుపాక గ్రామానికి చెందిన బొడ్డు శంకరయ్య(47) సోమవారం సాయంత్రం వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. చికిత్స కోసం అతడిని ఆలేరులోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడని ఎస్‌ఐ రజినికర్ మంగళవారం తెలిపారు. శంకరయ్యకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉండగా భార్య, కుమారుడు మృతి చెందారు. ఇద్దరు కుమార్తెలకు వివాహాలయ్యాయి.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి..


సత్తయ్య(ఫైల్)

**చండూరు, సెప్టెంబరు 3 :** డోజర్ వాహనం డ్రైవర్ నిర్లక్ష్యంతో వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చండూరు పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తాస్కానిగూడెం గ్రామానికి చెందిన రైతు వర్కాల సత్తయ్య(65) తన భార్య యాదమ్మతో కలిసి చండూరుకు బైకుపై వస్తున్నాడు. చండూరు శివారులోని శ్మశానవాటిక వద్ద రోడ్డు పక్కన ఉన్న పిచ్చిమొక్కలను తొలగిస్తున్న డోజర్ వాహన డ్రైవర్ నిర్లక్ష్యంతో వాహనాన్ని వెనక్కి నడిపించడంతో అదే సమయంలో బైక్‌పై వస్తున్న సత్తయ్యతో పాటు భార్య యదమ్మకు ఢీకొని బలమైన గాయాలన్నాయి. ఇద్దరిని నల్లగొండలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సత్తయ్య మృతి చెందాడు. సత్తయ్య కుమార్తె పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకన్న తెలిపారు.

# హైకోర్టు చెప్పినా అందని అర్చకుల వేతనాలు

**దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ వేణుగోపాలస్వామి దేవాలయ అర్చకులకు శాపంగా మారింది. తాతల పేరు మీద ఉన్న భూములను దేవాదాయ శాఖకు రిజిస్ట్రేషన్ చేయాలని అధికారులు వేతనాలు నిలిపివేశారు. తమకు జరిగిన అన్యాయంపై అర్చకులు హైకోర్టును ఆశ్రయించి వేతనాల కోసం ఆదేశాలు పొందినా తీర్పును అమలు పర్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఐదేళ్ల న్యాయపోరాటంతో ఐదు నెలల కిందట తమకు అనుకూలంగా తీర్పు వచ్చినా వేతనాల కోసం ఎదురుచూడక తప్పడం లేదు.**

**- హుజూర్‌నగర్**




సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం, శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయాలు వేర్వేరుగా ఉన్నాయి. వేణుగోపాలస్వామి ఆలయం పట్టణంలో ఉండగా, సీతారామచంద్రస్వామి ఆలయం ఐదు కిలోమీటర్ల దూరంలోని ఫణిగిరిగట్టుపై ఉంది. 2009 వరకు ఈ ఆలయాలు రికార్డుల్లో వేర్వేరుగా ఉన్నాయి. ఆ తర్వాత ఆలయానికి సంబంధించిన పాలకవర్గాలు, అధికారులు కలిసి రెండు ఆలయాలను ఒకటిగా చేశారు. అప్పటి నుంచి ఫణిగిరిగట్టుపై స్వయంభువుగా వెలిసిన శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఉత్సవవిగ్రహాలను పట్టణ నడిబొడ్డున ఉన్న శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో వేంచేయిస్తున్నారు. ఈ సాకుతోనే రెండు దేవాలయాలను విలీనం చేశారని సమాచారం.

### మస్కృతి ఇనాం భూములుగా రికార్డుల్లో నమోదుతో..

శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయానికి 627 ఎకరాల భూమి ఉండగా, శ్రీవేణుగోపాలస్వామి దేవాలయానికి 55ఎకరాల భూమి ఉంది. రెండు ఆలయాలకు కలిపి ప్రస్తుతం వారసత్వంగా నరగిరినాథుని భాస్కరాచార్యులు, నరగిరినాథుని మురళీచార్యులు, నరగిరినాథుని నర్సింహాచార్యులు, రంగభట్రాచార్యులు అర్చకులుగా కొనసాగుతున్నారు. దశాబ్దాల కిందట నరగిరినాథుని మురళి, నర్సింహాచార్యులు, భాస్కరాచార్యుల తాత, ముత్తాల కాలంలో మస్కృతి ఇనాం సర్వీస్ భూములను కొంత ఇవ్వగా అప్పుడు రికార్డుల్లో తాతల పేర్లు నమోదుచేశారు. శ్రీవేణుగోపాలస్వామి దేవాలయానికి సంబంధించి అర్చకులుగా(దశాబ్దాల కిందట) పనిచేసిన వారి పేరు మీద 43 రిజిస్ట్రేషన్‌లో 55 ఎకరాల భూమి ఉన్నట్లుగా రికార్డుల్లో తప్పుగా నమోదు చేసినట్లు సమాచారం. వాస్తవంగా అర్చకులు, స్థానాచార్యులు వేర్వేరుగా ఉన్నారు. కానీ స్థానాచార్యులకు సంబంధించిన భూములు సైతం అర్చకుల పేరు మీద పెట్టి 43 రిజిస్ట్రేషన్‌లో పొందుపర్చినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

### ఐదేళ్లుగా వేతనాలు నిలిపివేత

2013 నుంచి రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రస్తుత అర్చకులకు నామమాత్రపు వేతనాన్ని చెల్లిస్తుండేది. ఆ తర్వాత 2018 వరకు దేవాలయానికి వచ్చే ఆదాయం నుంచి నెలకు రూ.6,500లు అందించారు. అనంతరం 2018 నుంచి 2019 వరకు ఎండోమెంట్ శాఖ ప్రతి నెలా ఒక్కొక్కరికి రూ.22వేల చొప్పున వేతనాలు అందించారు. కాగా 2019 నుంచి నేటి వరకు అర్చకులకు వేతనాలు చెల్లించడం లేదు. ఆలయాలను మిళితం చేసే సమయంలో అర్చకుల పేరు మీద 43 రిజిస్ట్రేషన్‌లో పేర్కొన్న భూములను దేవాదాయ శాఖకు బదలాయించాలంటూ 2019నుంచి అర్చకులకు వేతనాలు నిలిపేశారు. ఇదిలా ఉండగా దేవాదాయ శాఖ రిజిస్ట్రేషన్ చేయాలంటున్న భూమిలో 20ఏళ్ల కిందట కొంత మంది వ్యక్తులు సర్వే నెంబర్లు మార్చి సుమారు 20 ఎకరాలను విక్రయించారన్న ఆరోపణలు ఉన్నాయి. కాగా మిగిలినభూములు అర్చకుల పేరు మీద ఉన్నాయంటూ తప్పుడు రికార్డులు రాశారని అర్చకులు మురళి, భాస్కరాచార్యులు, నర్సింహాచార్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవాదాయ శాఖ అధికారులు వేతనం నిలిపివేయడంపై ముగ్గురు 2019లో హైకోర్టును ఆశ్రయించారు. ఐదేళ్లుగా కొనసాగిన విచారణలో భాగంగా అర్చకులకు గతంలో ఇచ్చిన వేతనాల మాదిరి చెల్లించాలని 2023 డిసెంబరులో తీర్పును కోర్టు రిజర్వ్ చేసింది. అనంతరం ఈ ఏడాది మార్చిలో వేతనాలు చెల్లించాలని మరోసారి సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును ఎండోమెంట్ కమిషనర్‌కు అందజేసినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని అర్చకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఐదేళ్లుగా అర్చకులకు వేతనాలు చెల్లించకపోవడంతో తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అర్చకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### భూములు ఇస్తామన్నా..

ఇదిలా ఉండగా అర్చకులకు వేతనాలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు ఎండోమెంట్ భూములకు అర్చకుల వేతనాలకు, తాతల పేర్ల మీద ఉన్న భూములకు సంబంధం లేదని పేర్కొంది. అర్చకత్వం కింద వారికి వేతనాలు ఇవ్వాలని, ఆలయ భూములకు సంబంధించి కలెక్టర్ వద్ద తేల్చుకోవాలని సూచించినా అర్చకులకు వేతనాలు ఇవ్వకుండా ఉన్నతాధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇదిలా ఉండగా అర్చకుల తాతల పేర్ల మీద ఉన్న ఆలయ భూములను దేవాదాయ శాఖకు స్వాధీనం చేస్తామని అర్చకులు హామీ ఇచ్చినా ఎండోమెంట్ అధికారులు జీతాలు ఇవ్వకుండా ఐదేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అర్చకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### హైకోర్టు తీర్పును అమలుచేయాలి



ఐదేళ్లుగా వేతనాలు ఇవ్వడంలేదు. వేతనాలు ఇవ్వాలని హైకోర్టు తీర్పు ఇచ్చినా ఎండోమెంట్ ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదు. దీనిపై మరోసారి హైకోర్టును ఆశ్రయిస్తాం. శ్రీవేణుగోపాలస్వామి ఆలయ భూములు మా పేరు మీద ఉన్నట్లుగా తప్పుగా రికార్డుల్లో రాశారు. విచారణ చేయకుండా అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. జీతాలు నిలిపివేసి మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. తాత, ముత్తాతల పేరుతో ఉన్న భూములతో సంబంధం లేదు. దేవాదాయ శాఖ అధికారులు పూర్తి విచారణ చేసి వేతనాలు మంజూరు చేయాలి.

**- నరగిరినాథుని మురళీచార్యులు**

### నిర్ణయం ఉన్నతాధికారుల పరిధిలో ఉంది



అర్చకుల వేతనాల విషయం రాష్ట్ర ఎండోమెంట్ అధికారుల పరిధిలో ఉంది. వేణుగోపాలస్వామి ఆలయ భూమి మొత్తం అర్చకుల పేర్ల మీద ఉంది. గతంలో ఎవరు పొరపాట్లు చేశారో ఎలా చేశారన్న విషయం నా పరిధిలో లేదు. 2009కి ముందు కొన్ని రికార్డులు లేవు. శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ రికార్డులు ఉన్నా శ్రీవేణుగోపాలస్వామి దేవాలయ భూముల విషయంలో గందరగోళం జరిగింది.

**- కొండారెడ్డి, ఈవో**

## కస్తూర్బా పాఠశాలను తరలించాలి

**ఆదర్శపాఠశాల విద్యార్థినుల ఆందోళన ● ఎమ్మెల్యే హామీతో నిరసన విరమణ**


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఆరుబయట విద్యార్థులు

**వేములపల్లి, సెప్టెంబరు 3 :** తమ హాస్టల్ నుంచి కస్తూర్బా పాఠశాలను వేరేచోటుకు తరలించి సమస్యలను పరిష్కరించాలని నల్లగొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థినులు మూడు గంటల పాటు ఆందోళన చేశారు. ప్రధానగేట్ వద్ద కూర్చుని లోనికి ఎవరూ వెళ్లకుండా ఆందోళన చేయడంతో అంతసేపు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆరుబయటే ఉండిపోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100 మంది విద్యార్థుల వసతికి నిర్మించిన హాస్టల్‌లోకి మాడ్గులపల్లి కస్తూర్బా పాఠశాలల విద్యార్థినులు 350మందిని తరలించడం సమంజసం కాదన్నారు. కొద్దిరోజులుగా సుమారు 450 మంది విద్యార్థినులు ఒకేచోట ఇరుకైన గదుల్లో ఉంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రెండు రోజులుగా వర్షాలతో, నీటి సరఫరా సరిగా లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. పలుమార్లు అధికారులు కస్తూర్బా పాఠశాలను వేరేచోటుకు తరలిస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చినా అమలుచేయలేదన్నారు. విషయం తెలుసుకున్న ఎంఈవో బాలాజీనాయక్ రెండు రోజులు గడువు ఇవ్వాలని, మిర్యాలగూడకు తరలిస్తామని కోరారు. అందుకు విద్యార్థినులు ససేమిరా అంటూ ఆందోళన కొనసాగించారు.

### మూడు గంటలు ఆరుబయటే

ఆదర్శ పాఠశాల విద్యార్థినులు ఉదయం అల్పాహారం చేసిన వెంటనే పాఠశాల ప్రధాన గేటు దగ్గరకు వేసి 9గంటల సమయంలో ఆందోళనకు దిగారు. అప్పటి నుంచి పాఠశాలలోకి విద్యార్థిని, టీచర్లను అనుమతించలేదు. దీంతో వారంతా 3గంటల పాటు రోడ్డు వెంట చెట్ల కింద కూర్చున్నారు. అక్కడకు చేరుకున్న కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు రెమడాల పరుశురాములు విషయాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే విద్యార్థినులతో మాట్లాడి వినాయకచవితిలోగా కస్తూర్బా పాఠశాలను తరలించి సమస్యలు పరిష్కరిస్తామని నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

## రేషన్‌బియ్యం పట్టివేత

**దేవరకొండ, సెప్టెంబరు 3:** నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం జేత్య తండాలో అక్రమంగా నిల్వ చేసిన ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నర్సింహులు మంగళవారం తెలిపారు. తండాకు చెందిన కోట్యానాయక్ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ రమేష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

**చండూరు రూరల్ :** నల్లగొండ జిల్లా చండూరు మండలం గుండ్రపల్లి అక్రమంగా నిల్వచేసిన 11క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుండ్రపల్లి గ్రామానికి చెందిన వందనపు నరేందర్ తన ఇంట్లో రేషన్ బియ్యం నిల్వచేసినట్లు సమాచారం మేరకు మంగళవారం పోలీసులు తనిఖీలు చేశారు. నిల్వ చేసిన 11 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించి సీజ్ చేసి నరేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకన్న తెలిపారు.

## వేర్వేరు చోట్ల విద్యుదాఘాతానికి ముగ్గురు మృతి

**ఉమ్మడి నల్లగొండ జిల్లాలో విద్యుదాఘాతంతో ముగ్గురు మృతి చెందారు. నల్లగొండ జిల్లాలో ఇద్దరు, సూర్యాపేట జిల్లాలో ఒకరు మృతి చెందారు. అందులో రైతు, వ్యవసాయ కూలీతో పాటు యువకుడు ఉన్నారు.**

**దామరచర్ల, సెప్టెంబరు 3 :** విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామశివారులో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వీర్లపాలెం గ్రామానికి చెందిన పాతులోతు హాతి(25) విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేసే కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో కొండ్రపోల్ శివారులో విద్యుత్ స్తంభాన్ని గుంతలో దింపి పైకి ఎత్తిన అనంతరం పలుగుతో సరైన దిశలో తిప్పుతున్న క్రమంలో పైనుంచి వెళ్తున్న 11కేవీ విద్యుత్ తీగలకు స్తంభంపైన ఉన్న ఇనుప చువ్వ అంచు తగిలి విద్యుత్ సరఫరా జరిగి హాతి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే తోటి కార్మికులు 108 వాహనంలో మిర్యాలగూడకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. హాతికి భార్య అఖిల, మూడు సంవత్సరాల కుమార్తె, ఏడాది వయస్సున్న కుమారుడు ఉన్నారు. హాతి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం హాతి మృతదేహాన్ని మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### సాయానికి వెళ్లి విద్యుత్‌తెగిపడి రైతు...


వెంకటయ్య (ఫైల్)

**కొండమల్లేపల్లి:** నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం చిన్నఅడిశర్లపల్లిలో విద్యుత్ తీగలు తెగిపడి కార్మికుడు మృతి చెందాడు. ఎస్‌ఐ రాంమూర్తి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామానికి చెందిన రైతు రావుల వెంకటయ్య(52) స్థానిక శివగణేష్ కాటన్‌మిల్లుకు పనినిమిత్తం సాయంత్రం నాలుగు గంటలకు వెళ్లాడు. ఈ క్రమంలో మిల్లులో కార్మికులు ఉండే గదిలో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా అక్కడే ఉన్న వెంకటయ్యను నిచ్చెన పట్టుకోమన్నారు.ఈక్రమంలో విద్యుత్ తీగలు తెగి వెంకటయ్యపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య అలివేలు, కుమారుడు రమేష్, కుమార్తె అనిత ఉన్నారు.

### కొనసాగుతున్న ఆందోళన

మిల్లు యజమాని నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని వెంకటయ్య కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. మిల్లులో మృతదేహాన్ని ఉంచి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ ధనుంజయ్య, కొండమల్లేపల్లి, పీఏపల్లి ఎస్‌ఐలు రాంమ్మూర్తి, నర్సింహులు బాధితులకు నచ్చజెప్పి ప్రభుత్వ పరంగా న్యాయం జరిగేలా చూస్తామని చెప్పినా వారు వినలేదు. మిల్లు యజమాని వచ్చే వరకు ఇక్కడి నుంచి వెళ్లబోమని తేల్చిచెప్పారు. వెంకటయ్య బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా రాత్రి పొద్దుపోయే వరకు ఆందోళన కొనసాగుతోంది.

### వాటర్‌హీటర్ పెడుతుండగా వ్యవసాయ కూలీ..

**అనంతగిరి:** సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని వాయిలసింగారంలో విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందింది. ఎస్‌ఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వాయిలసింగారం గ్రామానికి చెందిన చలకపల్లి చిలకమ్మ(32) వ్యవసాయ కూలీ పనులు చేస్తుంటుంది. చిలకమ్మ మంగళవారం ఉదయం వరినాట్లకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి స్నానం చేసేందుకు వాటర్‌హీటర్ పెడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. చిలకమ్మ భర్త సత్యనారాయణ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా చిలకమ్మ కూలీ, నాలీ పనులు చేసుకుంటూ జీవిస్తుందని ఎస్‌ఐ తెలిపారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. చిలకమ్మ మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ఆర్టీసీ బస్సులో ఆగిన గుండె

**ఆస్పత్రికి తీసుకెళుతుండగా అస్వస్థత**


బస్ సీట్‌లోనే ఒరిగిన యాదమ్మ

**అర్వపల్లి, సెప్టెంబరు 3:** వైద్య పరీక్షలు చేయించుకునేందుకు బయలుదేరిన మహిళ ఆర్టీసీ బస్సులోనే గుండెపోటుతో కన్నుమూసింది. అప్పటిదాకా తమ పక్కన కూర్చున్న మహిళ మృత్యువాత పడడంతో బస్సులోని ప్రయాణికులంతా నిర్ఘాంతపోయారు. మంగళవారం సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలంలో ఈ ఘటన జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నాగారం మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన జటంగి యాదమ్మ (55)కు సోమవారం రాత్రి ఛాతిలో నొప్పిరావడంతో కుటుంబసభ్యులు గ్రామంలోనే ప్రథమ చికిత్స చేయించారు. మంగళవారం ఉదయం వైద్య పరీక్షల కోసం సూర్యాపేటలోని ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు తమ గ్రామం నుంచి ఆటోలో ఫణిగిరి స్టేజీ వద్దకు తీసుకొచ్చారు. అదే సమయంలో జనగామ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రావడంతో యాదమ్మ, ఆమె కుటుంబ సభ్యులు బస్సు ఎక్కారు. కొంతదూరం రాగానే మార్గమధ్యలో యాదమ్మకు ఆయాసం ఎక్కువైంది. మంచినీరు కావాలంటూ అడిగింది. ఆ సమయంలో ఆర్టీసీ బస్సు జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లికి రాగానే యాదమ్మ కూర్చున్న సీట్లలోనే గుండెపోటుతో మృతి చెందింది. యాదమ్మ పక్కనే భర్త అవిలయ్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. అయితే ఆర్టీసీ డ్రైవర్ బస్సును ఆపి అర్వపల్లికి చెందిన ఆటోలో యాదమ్మ మృతదేహాన్ని తరలించారు.విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వచ్చి పోస్టుమార్టం చేయించాలని చెప్పగా, కుటుంబసభ్యులు వద్దని వాదించారు. అయినా సరే పోలీసులు పంపించాలనడంతో యాదమ్మ మృతదేహాన్ని గంటపాటు ఆటోలోనే ఉంచారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సులో యాదమ్మ మృతి చెందడంతో కుమార్తెల రోదనలు చూసిన స్థానికులు కంటతడి పెట్టారు. యాదమ్మ కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్వపల్లి ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

## క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

**భువనగిరి అర్బన్, సెప్టెంబరు 3 :** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్యపూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి చెంత ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం జరిపిన అర్చకులు సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. సహస్రనామ పఠనాలతో 1000 తమలపాకులతో నాగవల్లీ దళార్చనలు చేపట్టారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాతసేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, సుదర్శన నారసింహహోమం, నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలను నిర్వహించారు. పాతగుట్ట ఆలయం, విష్ణుపుష్కరిణి, కొండపైన శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేకపూజలు చేపట్టారు. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరస్వామికి ముఖమండపంలోని స్ఫటికమూర్తులకు నిత్యపూజలు, నిత్య రుద్రహవనం కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.21,09,091 ఆదాయం సమకూరగా అందులో లీజుకు సంబంధించినవి రూ.5,81,181 ఉన్నట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.


ఆంజనేయస్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు

### చెర్వుగట్టుపై ఘనంగా లక్ష పుష్పార్చన

**నార్కట్‌పల్లి :** అమావాస్య తిథిని పురస్కరించుకుని నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని శైవక్షేత్రం చెర్వుగట్టు శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి లక్ష పుష్పార్చన వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చారు. తొలుత ప్రధానాలయం నుంచి మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవమూర్తులను మహామండపానికి చేర్చారు. ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సహఅర్చకులు లక్ష పుష్పార్చనను కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి వారి చెంత పూజలందుకున్న పూలను తీసుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. కార్యక్రమంలో ఈవో నవీన్‌కుమార్, దేవస్థాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

# నాటి జాగ్రత్తతో... నేడు ముంపు

**నడిగూడెం, సెప్టెంబరు 3:** ఖమ్మం జిల్లా వాసుల తాగునీటి అవసరాల కోసం వేసవిలో తీసుకున్న జాగ్రత్త భారీ వర్షాల సమయంలో నాగార్జునసాగర్ ఎడమకాల్వ గండికి కారణమైంది. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగిత రాంచంద్రాపురం వద్ద ఎడమకాల్వకు భారీ గండి పడేందుకు ఎన్నెస్పీ అధికారుల నిర్లక్ష్యమే కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. గండిపడిన ప్రాంతంలో అత్యవసరంగా తెరవాల్సిన ఎస్కేప్‌ను తెరవకపోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. వేసవిలో ఖమ్మం జిల్లా వాసులు తాగునీటి అవసరాల కోసం ఏప్రిల్‌లో సాగర్ ప్రాజెక్టులోని నీటిని ఎడమకాల్వ ద్వారా పోలీస్‌పహారా మధ్య ఖమ్మం జిల్లాకు తరలించారు. ఆ సమయంలో కాల్వ పొడవునా ఉన్న ఎస్కేప్, ఎత్తిపోతలు, మేజర్లు, మైనర్ల తూములన్నింటినీ అధికారులు పోలీసుల సహకారంతో మూసివేయించారు. రైతులు ఎవరూ తూములు తెరవకుండా షట్టర్లు కిందికి దించి తెరుచుకోకుండా వెల్డింగ్ చేయించారు. నీటి విడుదల నిలిపివేశాక అధికారులు వాటిని పట్టించుకోలేదు.


కాగితరాంచంద్రాపురం వద్ద ఎడమకాల్వపై ఎస్కేప్ వద్ద తూములకు చేసిన వెల్డింగ్ (రౌండప్‌లో)

### భారీ వర్షాలకు ఒత్తిడి పెరిగి...

వర్షాలకు ఎడమకాల్వలోకి భారీగా వరద చేరడంతో పాటు సాగర్ ప్రాజెక్ట్ నుంచి కాల్వకు నీటివిడుదల కొనసాగుతుండటంతో కాల్వలపై ఒత్తిడి పెరిగింది. దీంతో మూడు రోజుల కిందట సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితరాంచంద్రాపురంలోని ఎడమకాల్వపై 132, 133 కిలోమీటర్ల వద్ద రెండు చోట్ల భారీగా గండ్లు పడ్డాయి. వేసవిలో తూములు, ఎస్కేప్‌లకు వేసిన వెల్డింగ్‌లు తీసివేయించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీంతో ఎడమకాల్వ ద్వారా నీరు చేరుకునే పాలేరు వాగు బ్యాక్ వాటర్ వెనక్కి రావడం, కాల్వలో నీటి ఉధృతి ఉండటంతో గండ్లు పడ్డాయి. వరద సమయంలో ఎస్కేప్ తెరవాలన్న ప్రయత్నాలు కూడా చేయకపోవడంతో గండ్లుపడ్డాయని రైతులు ఆరోపిస్తున్నారు. సాగర్ నీళ్ల వదిలాక తూములు వెల్డింగ్ తొలగించి అవి పనిచేసేలా చూడాలని రైతులు, అధికారులను కోరినా నిర్లక్ష్యం చేశారు. ప్రధానంగా ఖమ్మం, సూర్యాపేట జిల్లాల ఎన్నెస్పీ అధికారుల మధ్య సమన్వయం లోపంతో ప్రమాదం సంభవించిందని ఇరుజిల్లాల రైతులు ఆరోపిస్తున్నారు. కాల్వకు నీటిని విడుదల చేస్తున్న సమయంలోనే వెల్డింగ్‌లను తీయాలని సూచించినా పట్టించుకోలేదని రైతులు విమర్శిస్తున్నారు. ఫలితంగా కాల్వకు గండితో పాటు రెండు వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా గండిపడి మూడు రోజులైనా పాలేరు, ఎడమకాల్వకు మంగళవారం నాటికి నీటి ఉధృతి తగ్గినా ఎస్కేప్, తూములను ఎత్తకపోవడం గమనార్హం. వెల్డింగ్‌లు తొలగించి తూములు ఎత్తాలంటే ఎన్నెస్పీ అధికారుల పర్యవేక్షణలోనే జరగాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎస్కేప్‌కు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

### ఎస్కేప్ తెరిచి ఉంటే...

ఎడమకాల్వపై నడిగూడెం మండలం కాగితరాంచంద్రాపురం వద్ద 132-133 కిలోమీటర్ రాయి మధ్య రెండు చోట్ల గండ్లు పడ్డాయి. గండిపడిన ప్రదేశానికి కిలోమీటరు దూరంలోనే ఎస్కేప్ ఉంటుంది. అయితే కాల్వలో నీటి ఉధృతి పెరిగినా, అనుకోని ప్రమాదం జరిగినా ఈ ఎస్కేప్‌ను అధికారులు తెరుస్తుంటారు. ఎస్కేప్ తెరిచి ఉంటే నీరంతా పిల్ల కాల్వ ద్వారా సమీపంలోకి ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలోని వాగులోకి చేరుతుంది. అక్కడి నుంచి ఈశ్వర్‌మాదారం, రాజాపేట తదితర గ్రామాల ద్వారా ఆయా ప్రాంతాల్లోని వరద వాగుల గుండా మున్నేరు వాగులోకి చేరుకుంటుంది. అదేవిధంగా ఈ కాల్వ ద్వారా వెళ్లే నీటిని సమీపంలోని రైతులు పొలాలకు మళ్లించుకునేవారు. తద్వారా నీటి వృథా తగ్గడంతో పాటు కాల్వపై ఒత్తిడి తగ్గి ఉండేది. గండ్లు పడే అవకాశం లేకుండాపోయేది.

### ఆలస్యంగా గండి వెలుగులోకి...

**హుజూర్‌నగర్:** సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పరిధిలోని సాగర్ ఎడమకాల్వ ముక్త్యాల 13వ బ్రాంచ్‌కెనాల్‌కు గండిపడిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ నెల 1వ తేదీన గండి పడగా అధికారులు ఆలస్యంగా గుర్తించారు. 14వ కిలోమీటర్ వద్ద 30మీటర్ల వెడల్పున కాల్వ కట్టకు గండిపడింది. మునగాల హెడ్‌రెగ్యులేటర్ నుంచి వచ్చే కాల్వకు కుడివైపున గండి పడడంతో హుజూర్‌నగర్ మండలంలోని కరక్కాయలగూడెం ప్రాంతంలోని పొలాలు నీటమునిగి ఇసుక మేటలు వేశాయి. ఈ వరద ప్రవాహం కరక్కాయలగూడెం, మగ్రిగూడెం ప్రాంతాల మీదుగా బూరుగడ్డలోని నల్లచెరువుకు వరద రావడంతో చెరువు కట్ట తెగింది. దీంతో సుమారు 500ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఇదిలా ఉండగా 13వ బ్రాంచ్ కెనాల్‌పై రెండు రోజుల కిందట 18వ కిలో మీటర్ వద్ద కాల్వ లైనింగ్ కొట్టుకుపోయింది. దీంతోపాటు 22వ కిలో మీటర్ వద్ద పంట పొలాల నుంచి వచ్చిన వరద ప్రవాహంతో రెండు చోట్ల కాల్వకు గండ్లు పడ్డాయి. మొత్తంగా మూడుచోట్ల గండిపడింది.



## నక్కలగండి రిజర్వాయర్‌కు భారీగా వరద


రిజర్వాయర్‌లోకి దుంధుభి నది వరద, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

**దేవరకొండ, సెప్టెంబరు 3:** నాగర్‌కర్నూల్ జిల్లాలో భారీ వర్షాలతో దుందుభి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో దిగువన ఉన్న నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని నక్కలగండి రిజర్వాయర్‌లోకి భారీగా వరదనీరు చేరుతోంది. దీంతో నక్కలగండి, పాతతెల్‌దేవరపల్లి, దేవరచర్ల, యలమలమంద, బొల్లారం గ్రామాలు, తండాలకు భారీగా వరదనీరు చేరి పత్తి పంటలు మునిగిపోయే పరిస్థితి నెలకొంది. రిజర్వాయర్‌లోకి నీరు చేరడంతో అధికారులు దిగువ భాగానికి గేట్లు ఎత్తివేసి నీటిని విడుదల చేస్తున్నారు. ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ మంగళవారం రిజర్వాయర్‌ను సందర్శించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వరదనీరు తండాల్లోకి వెళ్లకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. వరద బాధితులను పరిహారంతో పాటు అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. ఆయన వెంట ఆర్డీవో శ్రీరాములు, నీటిపారుదలశాఖ, రెవెన్యూ అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

### టెయిల్ పాండ్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

**దామరచర్ల :** ఎగువన నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ 26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలంలోని టెయిల్‌పాండ్‌కు మంగళవారం భారీఎత్తున నీరు వచ్చిచేరింది. దీంతో అధికారులు 11 గేట్లను ఐదు మీటర్లు, ఒక గేట్‌ను 2 మీటర్లు ఎత్తి 2,92,950 క్యూసెక్కుల నీటిని దిగువ పులిచింతల ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

## డ్రైవర్స్ కాలనీ సమస్యలు పరిష్కరించాలి



మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

**మోత్కూరు, సెప్టెంబరు 3:** మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని డ్రైవర్స్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ఆ కాలనీ వాసులు మునిసిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్‌కు, మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డికి వినతి పత్రాలు అందజేశారు. డ్రైవర్స్ కాలనీలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వినతి పత్రంలో పేర్కొన్నారు. పారిశుధ్య సమస్యలేకుండా చూడాలని, కుక్కల బెడద నివారించాలని, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు పురుగుల నర్సింహ, నాయకులు ఎండి.సమీర్, జానీపాషా, ఖలీల్, శ్యామల ప్రకాష్‌రెడ్డి, సోమలింగాచారి పాల్గొన్నారు.

## నాయి బ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలి

**ఆత్మకూరు(ఎం), సెప్టెంబరు 3:** నాయి బ్రాహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలని సంఘం మండల అధ్యక్షుడు బొల్లేపల్లి శ్రీహరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘం సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరోనా నుంచి నేటి వరకు నాయిబ్రాహ్మణుల వృత్తి దెబ్బతిని కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. నాయిబ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రత్యేక జీవో ఏర్పాటు చేసి, రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని, ఇల్లు లేని నిరు పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టించాలని కోరారు. 50 ఏళ్లు నిండిన వృత్తిదారులకు పింఛన్ ఇవ్వాలని, ప్రభుత్వ ఆసుపత్రులు, పోలీస్ శాఖల్లో ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు. క్షౌర వృత్తి దారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ వేముల భిక్షం, మండల ప్రధాన కార్యదర్శి బండి నరేష్, ఆర్.సత్తయ్య, ఆర్.బలరాం, ఏ.బుగ్గరాములు, ఎం.అంజయ్య, రవి, నర్సింహ, శ్రీను, నారాయణ, జమ్మయ్య పాల్గొన్నారు.

## మూసీ ప్రక్షాళనకోసం ఉద్యమించాలి



కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

**భువనగిరి రూరల్, సెప్టెంబరు 3:** మూసీ ప్రక్షాళన, కృష్ణ, గోదావరి జలాల సాధనే ధ్యేయంగా ఉద్యమించాలని మూసీ పరిరక్షణ వేదిక జిల్లా కో కన్వీనర్ కొండ మడుగు నర్సింహ కోరారు. మంగళవారం భువనగిరి మండలం అనాజీపురం గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 30నుంచి 40సంవత్సరాల పాటు పోరాట ఫలితంగా మూసీ ప్రధాన కాల్వకు అనుసంధానంగా జిల్లాలో బునాదిగాని, భీమలింగం, ఆసిఫ్‌నెహర్, ధర్మారెడ్డి, పిలాయిపల్లి కాల్వలు ఏర్పడ్డాయని, అయితే ఏళ్లు గడుస్తున్నా కాల్వల నిర్మాణం, నిర్వహణ మాత్రం నేటికీ పూర్తిస్థాయిలో లేదన్నారు. మూసీ ప్రక్షాళన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం సిగ్గు చేటన్నారు. వెంటనే మూసీని ప్రక్షాళించి, స్వచ్ఛమైన నీటిని అందజేయాలన్నారు. గోదావరి, కృష్ణా జలాలను ఈ జిల్లాలో పూర్తిస్థాయిలో వినియోగించే విధంగా పాలకులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈనెల 6వ తేదీన వలిగొండలో నిర్వహిస్తున్న సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో సీపీఎం నాయకులు దయ్యాల నర్సింహ, బొల్లేపల్లి కుమార్, ఎదునూరి మల్లేశం, గునుగుంట్ల శ్రీనివాస్, వెంకటేశ్, కృష్ణ, జహంగీర్, మల్లేశం, అశోక్, రాములు, ఎల్లయ్య పాల్గొన్నారు.

## గుర్తించిన ప్రతీ సమస్యను పరిష్కరిస్తాం: చైర్మన్



8వ వార్డులో పర్యటిస్తున్న మునిసిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

**భువనగిరి టౌన్, సెప్టెంబర్ 3:** పట్టణంలో గుర్తించిన ప్రతీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. కమిషనర్ పి.రామాంజలరెడ్డితో కలిసి ఆయన మంగళవారం భువనగిరి మున్సిపల్ 16వ వార్డులో పర్యటించారు. ఇటీవలే వరుస వర్షాలతో ఏర్పాడిన ఇబ్బందులను పరిశీలించి ప్రజలతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సహకారంతో పట్టణ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా మునిసిపల్ యంత్రాంగం పని చేస్తోందన్నారు. కౌన్సిలర్, కడారి ఉమాదేవి, నాయకులు వినోద్, ఎండీ తాజుద్దీన్, సాయికిరణ్ పాల్గొన్నారు.

## గురుకుల కళాశాలను తరలించొద్దు

**భువనగిరి అర్బన్, సెప్టెంబరు 3:** జిల్లా నుంచి మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాలను తరలించొద్దని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఏవో సి. జగన్మోహన్‌ప్రసాద్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ఇక్కడి నుంచి మహేశ్వరం మండలం కందుకూర్‌కు తరలించే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మెడికల్ కళాశాలను యాదగిరిగుట్టకు తరలించేందుకు చకచకా సన్నాహాలు సాగుతున్నాయన్నారు. జిల్లా కేంద్రం భువనగిరిలో ఉండాల్సిన అన్ని కార్యాలయాలు తరలిపోతుంటే ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని అన్నారు. నాయకులు బూరుగు మణికంఠ, మంగు నరసింహారావు, బట్టు క్రాంతి, పల్లెపాటి వేణుగోపాల్, రాళ్లబండి కృష్ణాచారీ, కానుకుంట్ల రమేష్, కొలిచేలిమి మల్లికార్జున్, సిద్దు, బాలకృష్ణ, బొజ్జ శివప్రసాద్ ఉన్నారు.

## 50శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ ప్రకటించాలి

**మోత్కూరు, సెప్టెంబరు 3:** ప్రభుత్వం 50 శాతం ఫిట్మెంటుతో పీఆర్‌సీ ప్రకటించాలని, 11, 12 జీవోలను సవరించి బీఈడీ అర్హత ఉన్న ఉపాధ్యాయులను పీఎస్ హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు, మోత్కూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి కోరారు. మంగళవారం మోత్కూరు ఉన్నత పాఠశాలలో మండల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మోత్కూరు మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు గాదె వెంకటేశ్వర్లు, పసునూరి సుధాకర్, నాయకులు రాజిడి రవీందర్‌రెడ్డి, బత్తిని రామకృష్ణ, ఇండ్ల రాంప్రసాద్, మందడి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**తుర్కపల్లి, సెప్టెంబరు 3:** తుర్కపల్లి ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు స్టడీ సెంటర్ కోఆర్డినేటర్, ప్రధానోపాధ్యాయుడు ఆర్.శ్రీనివాస్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ పి.బిక్షమయ్య తెలిపారు. గతంలో చదువు ఆగిపోయిన వారు, 15ఏళ్లు నిండిన వారు నేరుగా పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే అవగాశం ఉందని తెలిపారు. దరఖాస్తు చేసే అభ్యర్థులు వయస్సు ధ్రువీకరణ, ఆధార్ కార్డుతో పాటు రెండు ఫొటోలు తీసుకుని ఉన్నత పాఠశాలను సంప్రదించాలని కోరారు. దరఖాస్తు చేసేవారు 9985795778నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించాలి



బూరుగుపల్లి గ్రామపంచాయతీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

**రాజాపేట, సెప్టెంబరు 3:** మూడు నెలలుగా తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నామని, పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మంగళవారం రాజాపేట బూరుగుపల్లి గ్రామపంచాయతీ వద్ద గ్రామస్థులు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. నీళ్లు రావడం లేదని అధికారులకు, గ్రామకార్యదర్శికి మొర పెట్టుకున్నా పట్టించుకోవడంలేదని అన్నారు. నీటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, యాదవరెడ్డి, గోపాల్, కమలమ్మ, అనసూయ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# కాల్వను తలపిస్తున్న సీసీ రోడ్డు

● ఇబ్బంది పడుతున్న స్థానికులు, వాహనదారులు



ఇది కాల్వ కాదు..! వీరవెల్లి-పులిగిల్ల రోడ్డు

**భువనగిరి రూరల్, సెప్టెంబరు 3:** సీసీరోడ్డు నిర్మాణం అస్తవ్యస్తంగా చేపట్టడంతో చిన్నపాటి వర్షానికే ఆ రోడ్డు కాల్వను తలపిస్తోంది. భువనగిరి మండలంలోని వీరవెల్లి నుంచి పులిగిల్ల వరకు రెండేళ్ల క్రితం పంచాయతీ రాజ్ ఇంజనీర్ శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ. 28లక్షలు వెచ్చించి 4కిలో మీటర్ల రహదారిని ఏర్పాటు చేశారు. రహదారి నిర్మాణంలో అధికారుల పర్యవేక్షణ కొరవడడం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా సక్రమంగా నిర్మాణం చేయకపోవడంతో చిన్న వర్షానికే గ్రామ ముఖ్య కూడళ్లలోని ఎస్సీ కాలనీలో వరద నీరు ఇళ్లముందు వచ్చి చేరుతుండడం, ఆ రహదారి కాల్వల ఉండడంతో రాకపోకలు కొనసాగిస్తున్న వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు సంవత్సరాల క్రితం వీరవెల్లి గ్రామం నుంచి వలిగొండ మండలం పులిగిల్ల అక్కడి నుంచి వేములకొండ, వలిగొండ మండల కేంద్రానికి ఈ రహదారి గుండా నిత్యం వందలాది మంది వాహనాదారులు రాకపోకలు కొనసాగిస్తున్నారు. రోడ్డు సమస్య పరిష్కరించేందుకు వేసిన సీసీరోడ్డుతో కొత్త సమస్య రావడంతో గ్రామస్థులు అయోమయానికి గురవుతున్నారు. సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ సీసీరోడ్డును సరి చేసి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### అస్తవ్యస్తంగా రోడ్డు నిర్మాణం



రెండేళ్ల క్రితం వీరవెల్లి గ్రామం నుంచి పులిగిల్ల వరకు రోడ్డు నిర్మాణం అస్తవ్యస్తంగా చేపట్టారు. ఈవిషయమై తాము అప్పటికే కాంట్రాక్టర్, అధికారులను నిలదీసినప్పటికీ పట్టించుకోవడం లేదు. చిన్న వర్షం కురిసిన నీరంతా రహదారి గుంతలో చేరి దాదాపు 30మీటర్ల రోడ్డు పొడవు చిన్నపాటి కాల్వల మారింది. బురద నీరంతా ఇళ్లలోకి వచ్చి చేరుతోంది. ఉన్న సమస్య కంటే కొత్త సమస్యతో ఇబ్బంది పడుతున్నాం.

-కంచి లలిత, మాజీ ఎంపీటీసీ, వీరవెల్లి

### సమస్య నా దృష్టికి రాలేదు

తాను ఇటీవల కాలంలోనే బదిలీపై భువనగిరి పంచాయతీరాజ్ ఏఈగా బాధ్యతలు చేపట్టాను. ఇప్పటి వరకు ఈ అస్తవ్యస్త రోడ్డు విషయం తమ దృష్టికి రాలేదని వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించి సమస్య పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తానన్నారు.

-చిరుమర్తి రాకేశ్, ఏఈపీఆర్ భువనగిరి

# నల్లపోచమ్మకు చేనేత పట్టుచీర సమర్పణ



ఊరేగింపు ముందు భాగంలో ఉన్నపద్మశాలి మహాజన సంఘం, యువజన సంఘం నాయకులు



ఊరేగింపులో మగ్గంపై పట్టుచీరను నేస్తున్న భక్తుడు బల్ల దుర్వాసులు

**భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 3:** నల్లపోచమ్మదేవి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలో పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో ఊరేగింపులో మగ్గంపై పట్టు చీరను నేసి, అమ్మవారికి సమర్పించారు. ఒక వాహనంపై చేనేత మగ్గాన్ని ఏర్పాటు చేసి ఊరేగింపులో చీరను భక్తుడు బల్ల దుర్వాసులు భక్తి శ్రద్ధలతో నేసి ఆలయంలో అమ్మవారికి సమర్పించారు. ఉత్సవాల్లో పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు శ్రేష్ఠి, ఉపాధ్యక్షుడు అంకం మురళి, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు గంజి యుగేందర్, పోచంపల్లి చేనేత కార్మిక పట్టుచీరల ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షుడు రాపోలు శ్రీనివాస్, సూరపల్లి రాము, సూరపల్లి రవీందర్, సీత సత్యనారాయణ, కట్కూరి పాండురంగంగౌడ్, కొయ్యడ నర్సింహగౌడ్, గునిగంటి మల్లేష్‌గౌడ్, తండ వెంకటేష్ గౌడ్, పోచయ్యగౌడ్, సాయేష్‌కుమార్ పాల్గొన్నారు.

# డీజేలకు అనుమతులు లేవు: ఏసీపీ




ఆలేరులో శాంతి సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రమేష్

**ఆలేరు రూరల్, సెప్టెంబరు 3:** వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, డీజేలకు అనుమతులు లేవని ఏసీపీ రమేష్ అన్నారు. మంగళవారం స్థానిక లక్ష్మీగార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విగ్రహాలను ఏర్పాటు చేసే కమిటీ సభ్యులు తమ వివరాలను పోలీసులకు తెలపాలని, పరిసర ప్రాంత ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. 15 రోజుల్లోగా నిమజ్జనం చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, మునిసిపల్ కమిషనర్ లక్ష్మీ, సీఐ కొండల్‌రావు, ఎస్ఐ రజినికర్, పలు పార్టీల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

### నిమజ్జనాలను ఒకే రోజు నిర్వహించాలి

**చౌటుప్పల్ టౌన్ :** చౌటుప్పల్ పట్టణంలో గణేష్ నిమజ్జన ఉత్సవాలు ఒకే రోజు నిర్వహించే విధంగా ఉత్సవ కమిటీలు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు కోరారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గణేష్ ఉత్సవాలను పురస్కరించుకుని కో-ఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజు మాట్లాడుతూ హైదరాబాద్ తరహాలో గణేష్ విగ్రహాను ఒకే రోజు నిర్వహించడంతో శాంతిభద్రతలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఉంటుందని, గణేష్ శోభయాత్రకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం సులువు అవుతుందని ఆయన తెలిపారు. సీఐ మన్మధకుమార్ మాట్లాడుతూ, గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ హరికృష్ణ, మునిసిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్, ఎంపీడీవో ప్రమోద్ కుమార్, ఎస్ఐ లక్ష్మయ్య, మునిసిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుర్వి నర్సింహ పాల్గొన్నారు.

# అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

● జిల్లా వ్యవసాయాధికారి గోపాల్



నారాయణపురంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

**సంస్థాన్ నారాయణపురం/ చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 3:** అర్హత కలిగిన ప్రతీ రైతుకు రుణమాఫీ వర్తిస్తుందని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ తెలిపారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని రైతు వేదికలో రుణమాఫీ కుటుంబనిర్ధారణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతుల నుండి వస్తున్న దరఖాస్తులను ఆయన పరిశీలించారు. అనంతరం మండల పరిధిలోని వివిధ ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి ఎరువుల నిల్వల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఏఓ మాట్లాడుతూ... సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతులందరూ మండల పరిధిలో ప్రత్యేకంగా చేపట్టిన కుటుంబ నిర్ధారణ కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఒక్కో రోజు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అర్హత కలిగిన రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని ఎవరూ అపోహలకు గురి కావద్దని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పావని, ఏఈఓ నవీన్, స్వప్నిక సోమన్న, అనురాధ, రైతులు పాల్గొన్నారు.

● అర్హులైన రైతులందరికి రుణ మాఫీ జరుగుతుందని, ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ అన్నారు. చౌటుప్పల్ మునిసిపాలిటీలోని తాళ్లసింగారం లో మంగళవారం నిర్వహించిన రుణమాఫీ గ్రామ సభ కు గోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ, జిల్లాలో రైతుల నుంచి 18072 దరఖాస్తులు రాగా, అందులో 5372 పరిష్కరించామని ఆయన తెలిపారు. ఏవో ముత్యాల నాగరాజు పాల్గొన్నారు.

### సంక్షిప్తంగా..

**వలిగొండ:** తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి క్రిస్టఫర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఉద్యమకారుల సమస్యలను పరిష్కారించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

**మోత్కూరు :** మోత్కూరు మునిసిపాలిటీలో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే మందుల సామేల్ ఈ నెల 4న ఉదయం 11 గంటలకు మోత్కూరు రానున్నారని మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత లక్ష్మీనర్సింహారెడ్డి, కమిషనర్ సి.శ్రీకాంత్ విలేకరులకు తెలిపారు.

**మోత్కూరు :** మండలంలోని దత్తప్పగూడెం గ్రామంలో ఏపీ ఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరి సమక్షంలో వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

**ఆత్మకూరు(ఎం) :** మండల కేంద్రానికి చెందిన పంజాల మల్లయ్య అనే హమాలీ కార్మికుడు అనారోగ్యంతో మృతిచెందగా, సంఘం సభ్యులు బాధిత కుటుంబానికి రూ.10,000 సాయంగా అందజేశారు. అయిలయ్య, వెంకటేశం, నర్సయ్య, శ్రీను ఉన్నారు.

**భువనగిరి అర్బన్ :** ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుకునే విద్యార్థులు 100శాతం పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలు పొందేందుకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ కులాల అభివృద్ధి అధికారి ఎం. జయపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4నుంచి 31వరకు గడువు ఉన్నట్లు తెలిపారు.

**మోత్కూరు :** మండలంలోని దత్తప్పగూడెంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన కమ్యూనిటీ ప్లాంటేషన్‌ను సామాజిక తనిఖీ డీఆర్‌పీ పి.స్వామి, వీఎస్‌పీ కె.పల్లవి పరిశీలించారు. ఫీల్డ్ అసిస్టెంట్ కంచర్ల సోమిరెడ్డి వారి వెంట ఉన్నారు.

**ఆలేరు రూరల్:** సర్వాయిపాపన్న మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని కొలనుపాక గ్రామానికి చెందిన దూడల రమేష్‌గౌడ్‌ను నియమిస్తూ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కి వీరస్వామి నియామకపత్రాన్ని అందజేశారు.

**ఆలేరు రూరల్:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు, ఇంగ్లీష్, సివిక్స్ సబ్జెక్టులు బోధించడానికి అతిథి అధ్యాపకులుగా పనిచేయడానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ రాజారాంనాయక్ ఒక ప్రకటనలో కోరారు. అర్హులు ఈనెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

**ఆలేరు రూరల్:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జనని స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రామకృష్ణా విద్యాలయంలో వ్యాసరచన పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో పలు ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలకు చెందిన వంద మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

**భువనగిరి టౌన్:** సుప్రీం, హైకోర్టుల ఆదేశాలను ప్రభుత్వం అమలు చేసి బీసీ విద్యుత్ ఉద్యోగులకు న్యాయం చేయాలని ట్రాన్స్‌కో డీఈ మల్లికార్జున్‌గౌడ్, బీసీ విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి మురళి అన్నారు. మంగళవారం భువనగిరిలో జరిగిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు.

**తుర్కపల్లి:** హైద్రాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ఈనెల 9వ తేదీన నిర్వహించే గిరిజన సింహ గర్జన మహా సభను విజయవంతం చేయాలని సేవాలాల్ సేన జిల్లా కన్వీనర్ ధరావతు నర్సింహనాయక్ కోరారు. మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో గిరిజన సింహ గర్జన కరపత్రాల ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

**భూదాన్‌పోచంపల్లి :** ముక్తాపూర్ పాఠశాలకు స్థానిక నాయకుడు నక్క రాజిరెడ్డి రూ.20వేల విలువైన స్కానర్, ప్రింటర్‌ను మంగళవారం బహూకరించారు.

## బీసీ బాలుర కళాశాల హాస్టల్ మంజూరు

● ఇంటర్ విద్యార్థులకు ప్రయోజనం



మోత్కూరులో ఏర్పాటు చేయనున్న బీసీ బాలుర కళాశాల హాస్టల్ భవనం

**మోత్కూరు, సెప్టెంబరు 3:** తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ కృషి మేరకు మోత్కూరు మండల కేంద్రంలో ఉన్న బీసీ బాలుర-ఎ హాస్టల్‌ను బీసీ బాలుర కళాశాల హాస్టల్‌గా మార్చుతూ బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బి.బాలమయాదేవి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మోత్కూరు, అడ్డగూడూరు, గుండాల, ఆత్మకూరు(ఎం) మండలాలకు కేంద్రంగా ఉన్న మోత్కూరులో కళాశాల హాస్టల్ లేకపోవడం, గతంలో మాదిరిగా గ్రామాల నుంచి మోత్కూరు మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇంటర్ విద్యకు దూరమవుతున్నారు. మోత్కూరులో బీసీ బాలురకు ఏ, బీ హాస్టళ్లు ఉన్నాయి. వీటి పక్కా బిల్డింగ్‌లు కూడా ఉన్నాయి. హాస్టల్-ఏ లో విద్యార్థులు తక్కువగా ఉండటంతో అందులోని విద్యార్థులను హాస్టల్-బీలో కలిపారు. దీంతో ఖాళీగా ఉన్న హాస్టల్-ఏను కళాశాల హాస్టల్‌గా మార్చాలని మోత్కూరు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభజస్టిస్ ఇచ్చిన వినతి పత్రం, బీసీ సంక్షేమ జిల్లా అధికారి పి.యాదయ్య నివేదిక మేరకు, ఎమ్మెల్యే సామేల్ కృషితో బీసీ బాలుర-ఎ హాస్టల్‌ను కళాశాల హాస్టల్‌గా మార్చారు. ఇందులో ఎస్సీ, బీసీ విద్యార్థులను చేర్చుకుంటారు. త్వరలోనే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించనున్నట్లు తెలిసింది. మోత్కూరుకు కళాశాల హాస్టల్ మంజూరు చేయడం పట్ల మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు పైళ్ల సోమిరెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభజస్టిస్ హర్షం వ్యక్తం చేస్తూ, హాస్టల్ మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే సామేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న గ్రామస్థులు

**వలిగొండ, సెప్టెంబర్ 3:** మండలంలోని వెల్వర్తి గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ఉక్కుర్తి స్వామి మాట్లాడుతూ, గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, హైస్కూల్‌కు ప్రహరీ గోడ, స్వీపర్, అటెండర్లను నియమించాలని కోరారు. బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. 1000 మీటర్ల సీసీ రోడ్డుకు నిధుల మంజూరు చేయాలని, తాగునీటి సమస్యలను పరిష్కారించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, చంద్రయ్య, సైదులు, గణేష్, ముత్యాలు, నవీన్ పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి పేదలకు వరం

**రామన్నపేట, సెప్టెంబర్ 3:** సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని వెల్లంకి మాజీ ఎంపీటీసీ తిమ్మాపురం మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం గ్రామానికి చెందిన నకిరేకంటి మహేష్, గుర్రం నరేష్, నన్నూరి బిక్షంరెడ్డి, ఎస్ మహేష్ అనారోగ్యంతో హైదరాబాదులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందగా వారికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరు అయిన చెక్కును మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పున్న నర్సింహ, మాజీ డీసీసీ కార్యదర్శి తాటిపాముల శేఖర్ గౌడ్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు అయిటిపాముల పెద్దులు, నకిరేకంటి రవీందర్, కర్రె రమేష్, నిమ్మల మధు, రుద్ర వెంకటేశం, పోషబోయిన పరమేశం, సాగర్ల సైదులు పాల్గొన్నారు.

## ధర్మారెడ్డిపల్లి కాల్వ ద్వారా చెరువును నింపాలి



ధర్మారెడ్డిపల్లి కాల్వలోకి దిగి నిరసన తెలుపుతున్న మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు

**రామన్నపేట, సెప్టెంబరు 3:** ధర్మారెడ్డిపల్లి కాల్వ ద్వారా రామన్నపేట పెద్ద చెరువును నీటితో నింపి రైతాంగాన్ని, మత్స్యకారులను ఆదుకోవాలని మత్స్య పారిశ్రామిక సహకారసంఘం అధ్యక్షుడు కందుల హనుమంతు, కార్యదర్శి పిట్టల మత్స్యగిరి డిమాండ్ చేశారు. ధర్మారెడ్డిపల్లి కాల్వకు ఫీడర్ ఛానల్ ఏర్పాటు చేసి ఈ ప్రాంత రైతాంగనికి సాగునీరు అందించాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ పెద్దబోయిన మీనమ్మ, బచ్చ రాములు, లింగస్వామి, జింకల చిన్నరాములు, మహిళా మత్స్యకారులు భాగ్యమ్మ, అనసూయ, నర్సమ్మ, ఇందిరా, రాములమ్మ, లలిత పాల్గొన్నారు.

## పార్ట్ టైమ్ ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకోవాలి



ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు

**అడ్డగూడూరు, సెప్టెంబరు 3:** మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలల్లో పార్ట్‌టైం ఉపాధ్యాయులుగా నియామకమైన వారిని విధుల్లోకి తీసుకోవాలని పార్ట్ టైమ్ ఉపాధ్యాయులు కోరారు. ఈమేరకు మంగళవారం పాఠశాల ప్రిన్సిపాల్ రమకు వినతి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా వారు పలువురు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా గురుకుల బాలికల పాఠశాలల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా పని చేస్తున్న తమపై ఎలాంటి ఆరోపణలు లేనప్పటికీ ప్రభుత్వం విధుల నుంచి తొలగించడంతో తమ కుటుంబాలు రోడ్డున పతాయన్నారు. ప్రభుత్వం తమను విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

## సభ్యత నమోదులో వేగం పెంచాలి

**మోటకొండూరు, సెప్టెంబరు 3:** సభ్యత్వ నమోదు కర్యక్రమంలో వేగం పెంచాలని బీజేపీ జిల్లా కార్యదర్శి వేముల నరేష్ అన్నారు. మంగళవాం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యశాల నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ నుంచి సభ్యత్వ నమోదును చేపట్టనున్నట్లు తెలిపారు. సభ్యత్వ నమోదులో మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. పార్టీ సభ్యత్వం పొందేందుకు 8800202024 నెంబర్‌కు మిస్ కాల్ ఇవ్వడంతో సభ్యత్వాన్ని నమోదు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తండ కృష్ణ, జిలా కార్యవర్గ సభ్యుడు చిర్ర రవీందర్, గాజుల బాలరాజు, మండల కన్వీనర్ మల్గా అశోక్, మండల ప్రధాన కార్యదర్శి అలేటి నాగరాజు, మండల కోశాధికారి బాల్ద నర్సింహులు, భూమండ్ల సతీష్, రేగు ఉపేందర్, ప్రదీప్, మహేష్ పాల్గొన్నారు.

## తినుబండారాల తయారీ కేంద్రాలపై సోదాలు

**మోత్కూరు, సెప్టెంబరు 3:** మోత్కూరు మండల కేంద్రంలో మిక్చర్, చెకోడీలు, బూందీ తదితర తినుబండారాల తయారీ కేంద్రాలపై మంగళవారం సాయంత్రం ఎస్‌వోటీ పోలీసులు సోదాలు నిర్వహించారు. తినుబండారాల్లో సింథటిక్ రంగులు కలుపుతున్నారన్న అనుమానంతో మోత్కూరు సందరయ్య కాలనీలో పగడాల లక్ష్మీనర్సయ్యకు చెందిన మిక్చర్, చెకోడీల తయారీ కేంద్రంపై దాడి చేసి మిక్చర్, చెకీడీల తయారీలో కలిపే ఆరోగ్యానికి హాని చేసే కలర్స్‌ను సీజ్ చేశారు. మిక్చర్, బూందీ, చెకోడీలు, బఠాణీలు మంచి రంగులో చూడగానే ఆకట్టుకునేలా సింథటిక్ కలర్స్ కలుపుతున్నారని ఎస్‌వోటీ పోలీసులు తెలిపారు. ఈ కలర్స్ ఆరోగ్యానికి హాని చేస్తాయన్నారు. నూనె కూడా కలుషితంగా ఉండటంతో నూనె శాంపిల్స్ తీసుకెళ్లారు. తయారీదారు లక్ష్మీనర్సయ్యను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు.